ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

శనివారం 27 జూలై 2024



కాగ్నాకు జలకళ

చాలా కాలంగా నీరు లేక వెలవెల బోయిన కాగ్నానదికి జలకళ సంతరించుకుంది. కొద్దిరోజులుగా కురుస్తున్న వానలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. తాండూరు నియోజకవర్గానికి జీవనాధారమైన కాగ్నా నదిలోకి వర్షం నీరు చేరింది. దీంతో బ్రిడ్జికి ఇరువైపులా నీటితో కళకళలాడుతోంది. నది పరివాహక ప్రాంతం పచ్చదనంతో ఆహూతులను ఆకట్టుకుంటోంది. నదిలోకి వరదనీరు చేరడంతో మహిళలు గంగమ్మకు పూజలు చేస్తున్నారు.

- తాండూరు, జూలై 26



కాగ్నాలో చేరిన నీరు


శాకాంబరి అలంకరణలో దుర్గమ్మ



కీసరగుట్టలోని దుర్గామాత శుక్రవారం భక్తులకు శాకాంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రామలింగేశ్వరుడిని దర్శించుకున్న అనంతరం మహిళా భక్తులు అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

- కీసర,జూలై 26

లక్ష్మాపూర్ గ్రామంలో భూములు



తలనొప్పిగా మారిన లక్ష్మాపూర్ రైతుల భూ సమస్య

- ఏళ్లు గడుస్తున్నా పరిష్కారం కానీ వైనం
- ప్రభుత్వ పథకాలకు నోచక ఆవేదన
- ప్రభుత్వాలు మారినా పరిష్కారం శూన్యం
- రీ సర్వే గ్రామస్తుల పాలిట పాపమా?
- ఇదే అదనుగా రెచ్చిపోతున్న అక్రమార్కులు
- అధికారుల అండదండలతో చేతులు మారుతున్న లావణి, పట్టా భూములు

నక్ష లేక నరకం!

దేశానికి వెన్నెముకగా చెప్పే రైతులకు భూ సమస్యలు వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి తరాలు మారినా తలరాతలు మారకపోవడంతో ఆర్తనాదాలు చేస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా తమ సమస్య ఎవరికి పట్టకపోవడంతో పరేషాన్ అవుతున్నారు. ఇది ఎక్కడో కాదు.. గత ముఖ్యమంత్రి కేసీఆర్ దత్తత మండలం, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొదటి గర్జన గడ్డ అయిన మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామ సమస్య . రెవెన్యూ వ్యవస్థ ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా ఈ గ్రామానికి నిర్దిష్టమైన గ్రామ నక్ష లేకపోవడం, సరైన భూ రికార్డులు లేకపోవడం ఆ గ్రామ రైతాంగాన్ని పట్టి పీడిస్తోంది. తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎదురుచూస్తున్న రైతులకు ఏళ్లనాటి శని వదలడం లేదు.

మూడుచింతలపల్లి, జూలై 26: తరతరాలుగా తాతలు, ముత్తాతలు వారసత్వంగా ఇచ్చిన ఆస్తులు తమకు ఏ విధంగా ఉపయోగపడడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. సరైన రికార్డులు లేని కారణంగా తమ భూమి ఎక్క డ ఉందో.. ఎంత ఉందో అంతుచిక్కక అయోమయానికి గురవుతున్నారు. తరాలు మారినా ప్రభుత్వాలు మారినా తమకు ఎలాంటి న్యాయం జరగడం లేదని విసిగెత్తిపోతున్నారు. స్వయాన రాష్ట్ర సీఎంమే దిగివచ్చినా తమ భూ సమస్యలు పరిష్కారం లభించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామరెవెన్యూ వ్యవస్థ ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా వారి భూ సమస్య మాత్రం ఎక్కడ వేసినా గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. సరైన భూరికార్డులు(నక్ష) లేకపోవడంతో తమకున్న భూమి ఎక్కడ ఉందో ఎంత ఉందో రైతులకు తెలియని పరిస్థితి నెలకొంది. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న ఆగ్రామ రైతాంగానికి జీవితమే అంధకారంగా మారింది. తమకు ఉన్న పొలంలో సాగు చేసుకుందామన్న రైతన్నకు అప్పులు దొరకకపోవడం ఒకటైతే, ఆ భూమిని అమ్ముకుందామనుకున్నా వీలులేని పరిస్థితి మరొకటి. లోన్ల (అప్పు) కోసం బ్యాంకుల చుట్టూ తిరిగినా, అమ్ముకుందామని కార్యాలయాల చుట్టూ తిరిగినా తిప్పలు తప్పడం లే దు. సరైన భూరికార్డు లేదనే వంకతో అన్నిదారులు మూసుకుపోతున్నాయి. చేసేదేమి లేక చెప్పుకోవడానికి ఎవ్వరూలేక లక్ష్మాపూర్ రైతులు ఆందోళన చెందుతున్నారు.

మారని తలరాతలు

లక్ష్మాపూర్ గ్రామంలో భూసమస్య రైతుల పాలిట శాపంగా మారింది. స్వయాన ముఖ్యమంత్రులే దిగి వచ్చినా భూసమస్యకు పరిష్కారం మాత్రం చూపలేకపోతున్నారు. 2017లో అప్పటి సీఎం కేసీఆర్ లక్ష్మాపూర్ గ్రామాన్ని సందర్శించడంతో ఆ ప్రజలు స్వయాన దేవుడే దిగివచ్చాడని భావించారు. సభలు పెట్టి సమస్యను పరిష్కారిస్తానని చెప్పడంతో తమ భవిష్యత్తు బంగారంగా మరుతుందని సంబరపడ్డ రైతుల ఆశలు ఆవిరవ్వడానికి ఎక్కువ కాలం పట్ట లేదు. ధరణితో తమ జీవితాలకు దారి దొరుకుతుందని అనుకుంటే ఇప్పుడు ఆ ధరణియే శాపమై పీడిస్తోంది. అప్పుడే నేనున్నా... అంటూ పలకరించిన నాటి ఎంపీ, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నో హామీలు ఇచ్చినప్పటికీ ఎక్కడి సమస్య అక్కడే ఆగిపోయింది. కనీసం రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత ఈ సమస్య తీరుతుందంటే అతీగతీ లేకుండా పోయింది. లక్ష్మాపూర్ గ్రామ రైతులు కనీసం రుణమాఫీకి నోచుకోవడం లేదు. ఈ గ్రామ భూ సమస్యలపై ఇప్పటికైనా సీఎం చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని రైతులు వేడుకుంటున్నారు.

తారుమారు..

పట్టా భూములను లావణి (అసైన్డ్) పట్టాలుగా, లావణి భూములు పట్టా భూములుగా మారిపోయాయి. అంతే కాకుండా అటవీ శాఖ భూములు కొంత అన్యాక్రాంతమైనట్లు తెలుస్తోంది. దీంతో అక్రమార్కులు, భూ కబ్జాదారులు ఇదే అదనుగా అక్రమణలకు పాల్పడుతున్నారు. పెద్దఎత్తున ప్రభుత్వ, అటవీ, లావణి భూములు చేతులు మారుతున్నాయి. రీ సర్వేతో కొంత మందికి భూమి ఉన్నదాని కంటే ఎక్కువగా రాగా, మరికొంత మందికి తక్కువగా వచ్చింది. పాత రికార్డుల ప్రకారం ఉన్న సర్వే నంబర్లు, కొత్తగా చేసిన సర్వేతో భూ సర్వే నంబర్లు మారడంతో గందరగోళం నెలకొంది. ఇదే అదనుగా భూ బకాసురులు,గ్రామస్తులు అధికారులను కలుపుకుని అటు ప్రభుత్వ లావణి పట్టా భూములకు ఎసరు పెట్టారు. ఈ క్రమంలో అందినకాడికి దండుకుంటున్నారు. రీ సర్వేతో పాటు కొత్త రికార్డుల కారణంగా బ్యాంక్‌లోన్, భూ తగాదాలు ఎక్కువ య్యాయి. ఇద్దరు ముఖ్యమంత్రుల మానస పుత్రిక అయిన లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన రైతులకు మాత్రం ఎలాంటి న్యాయం జరగడం లేదు. రీ సర్వేతో పట్టాదారు పాస్‌పుస్తకాలు రాక, పట్టా భూములు లావణి పట్టాలుగా మారడంతో పాటు సర్వే నంబర్లు మారి రైతులు అయోమయంలో పడ్డారు. అప్పటి సీఎం కేసీఆర్ ప్రారంభించిన రైతుబంధు, రైతుబీమాతో పాటు ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన రైతు రుణమాఫీ పథకాలకు లక్ష్మాపూర్ గ్రామస్తులు నోచుకోవడం లేదు. సాక్ష్యాతూ సీఎంలే సమస్యను పరిష్కరించకపోతే ఇంకేవరికి మొరపెట్టుకోవాలని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రీ సర్వే శాపమా..

లక్ష్మాపూర్ గ్రామాన్ని ఆగస్టు 2017 లో అప్పటి ముఖ్యంత్రి కేసీఆర్ సందర్శించి సర్వే చేసి గ్రామ రూపు రేఖలు మారుస్తానని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. చెప్పిందే తడువుగా రెవెన్యూ, సర్వే తదితర శాఖల అధికారులు ఉరుకులు పరుగులు పెడుతూ సర్వే నిర్వహించారు. అయితే అసలు సమస్య అక్కడే మొదలైంది. అప్పటి వరకు ఎవరి భూములు, ఎవరి రికార్డులు వారికి ఉండగా రీసర్వే కొత్త తంటాలను తెచ్చి పెట్టింది. లక్ష్మాపూర్ గ్రామంలో మొత్తం 3,250 ఎకరాల భూమి ఉంది. అందులో పట్టాభూములు, సుమారు 300ఎకరాల పైచిలుకు లావాణి (అసైన్డ్‌భూములు) పట్టా, ప్రభుత్వ భూమి, 1100ఎకరాలపైగా అటవీ భూములున్నాయి. సర్వే అనంతరం అధికారుల తప్పిదంతో కొత్తగా చేసిన రికార్డులతో గందరగోళం మొదలైంది.

త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం



లక్ష్మాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో భూ సమస్యలకు సంబంధించి ప్రస్తుతం 72 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రైతుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తాం. అర్హులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తాం.

- వెంకటనర్సింహారెడ్డి, తహసీల్దార్. మూడుచింతలపల్లి

సంక్షేమ పథకాలు అందడం లేదు



లక్ష్మాపూర్‌లో 6.20 ఎకరాల భూమి ఉంది. అందులో 3 ఎకరాలకు మాత్రమే పట్టాదారు పుస్తకాలు వచ్చాయి. మిగిలిన మూడు ఎకరాలకు పాస్‌బుక్ రాలేదు. దీంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందడం లేదు.

- అప్పాల మల్లేషం, రైతు, లక్ష్మాపురం

పాస్‌బుక్ రాలేదు



నాకు నాలుగు ఎకరాల లావాణి పట్టా భూమి ఉంది. అందులో నేను సాగు చేసుకుంటున్నాను. నాకు ఇప్పటి వరకూ పట్టాదారు పాస్‌బుక్ రాలేదు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కరించడం లేదు.

- బందెల మల్లయ్య, రైతు, లక్ష్మాపురం

51మందికి రుణమాఫీ



పట్టాదారు పాస్ పుస్తకాలు లేని కారణంగా సంక్షేమ పథకాలకు అర్హులు కాలేదు. లక్ష్మాపూర్ గ్రామంలో రైతురుణ మాఫీ కింద ఇప్పటి వరకు 51 మంది లబ్ధిపొందారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు రుణమాఫీ చేయడం జరుగుతుంది.

- కృష్ణవేణి, వ్యవసాయశాఖ అధికారి, మూడుచింతలపల్లి



పూడూరు పీహెచ్‌సీని సందర్శించిన అధికారుల బృందం

పీహెచ్‌సీలను సందర్శించిన రాష్ట్ర బృందం

వికారాబాద్, జూలై 26: పీహెచ్‌సీల్లో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలు, ఇంటిగ్రేటెడ్ డిసీస్, సర్వైలెన్స్ ప్రోగ్రాం అమలు తీరుపై ఇంటిగ్రేటెడ్ డిసీస్ సర్వైలెన్స్‌ప్రోగ్రాం రాష్ట్ర బృందం పరిశీలించింది. శుక్రవారం జిల్లాలోని పూడూరు, సిద్దులూరు, కొత్తగడి పీహెచ్‌సీలను సందర్శించి ప్రోగ్రాం అమలు తీరుతోపాటు అక్కడి వైద్యులకు సలహాలు, సూచనలు అందజేశారు. సర్వైలెన్ ప్రోగ్రాం సమర్ధవంతంగా అమలు తీరును బృందం ప్రశంసించింది. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పాల్వాన్ కుమార్‌తో సమావేశమయ్యారు. ఈ బృందంలో డాక్టర్ మోహన్, డాక్టర్ రాజల్, ఆనంద్, ముఖంతేష్ తోపాటు డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్రయాదవ్ తదతరులు ఉన్నారు.

బషీరాబాద్ పీహెచ్‌సీకి మహర్దశ

- కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా ఆస్పత్రి మార్పు
- తెలంగాణ వైద్యవిధాన పరిషత్ పరిధిలోకి బదిలీ
- ఉత్తర్వులు జారీ ..సీహెచ్‌సీలో ప్రారంభమైన సేవలు



బషీరాబాద్, జూలై 26: బషీరాబాద్ పీహెచ్‌సీకి ఏట్టకేలకు మహర్దశ పట్టుకుంది. ఇకపై మండల ప్రజలకు స్థానికంగా ఆస్పత్రిలో మెరుగైన అన్ని రకాల వైద్య సేవలు అందనున్నాయి. వైద్యసేవలను మరింత మెరుగుపరచాలనే ఉద్దేశంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో కొనసాగిన పీహెచ్‌సీని తెలంగాణ వైద్య విధానపరిషత్ పరిధిలోకి బదిలీచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ క్రమంలో వైద్యవిధాన పరిషత్ అధికారులు పీహెచ్‌సీని గురువారం తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ మేరకు బషీరాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)గా మారింది. దీంతో శుక్రవారం నుంచి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కింద వైద్య సేవలు కూడా ప్రారంభమయ్యాయి. కొత్తగా ఏర్పాటైన కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు ఇప్పటికే కొత్తగా ముగ్గురు వైద్యులు, 15 మంది స్టాఫ్ నర్సులను కూడా నియమించారు. ఈ ఆస్పత్రిని 10 నుంచి 30 పడకలకు సామర్థ్యానికి పెంచుతూ త్వరలో రోగులకు అవసరమయ్యే సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ సీహెచ్‌సీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరై కొత్తగా నిర్మించే వరకు ప్రస్తుత పీహెచ్‌సీ భవనంలోనే వైద్యులు ప్రజలకు వైద్య సేవలు అందించనున్నారు.

అందుబాటులోకి మెరుగైన వైద్య సేవలు

ఇకపై సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెటర్)లో అన్నిరకాల వైద్య సేవలతో పాటు 24గంటలు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. ఓపీ, గర్భిణుల సేవలు మరింత మెరుగవుతాయి. ఓపీ విభాగాలు, వార్డులు, మార్చురీ, గర్భిణులకు అవసరమైన స్కానింగ్ నిర్వహించడం, శస్త్రచికిత్సల ద్వారా ప్రసవాలు, ప్రసూతి, పిల్లల విభాగాలకు ప్రత్యేక వైద్యులు, చిన్నచిన్న అపరేషన్లు చేసి పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థికభారం లేకుండా సదుపాయాలు కల్పిస్తారు. ఈ ఆస్పత్రిలో సివిల్ సర్జన్లు, స్త్రీవైద్య నిపుణులు, మత్తు వైద్యుడు, దంత, రేడియాలజీ సర్జన్, జనరల్ మెడిసన్, ల్యాబ్ టెక్నీషియన్ వంటి స్పెషలిస్టులను కూడా నియమించబోతున్నారు. అవసరమైన వైద్యులు, 15నుంచి 20మంది వరకు స్టాఫ్ నర్సులకు నియమించనున్నారు. ఈ ఆస్పత్రిలో ఎక్స్‌రేలు, రక్త, మూత్ర ఇతరేత్ర అన్ని రకాల పరీక్షలకు ల్యాబ్‌లు, పరికరాలు అందుబాటులోకి రానున్నాయి. ఇక్కడి రోగులకు అవసరమైన మందులు ఉచితంగా ఇస్తూ మెరుగైన వైద్యసేవలు అందిస్తారు. వీటితో పాటు శానిటేషన్, కట్టుకట్టే సిబ్బంది, నైట్ వాచ్‌మెన్లు రానున్నారు.

సీఎంఆర్ డెలివరీ సకాలంలో పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



మిల్లు యజమానితో మాట్లాడుతున్న లింగ్యానాయక్

వికారాబాద్, జూలై 26: సీఎంఆర్ డెలివరీ సకాలంలో నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. మండల పరిధిలోని వెంకట రమణ రైసుమిల్లును శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ 2023-24కు సంబంధించి కస్టమ్ మిల్లింగ్ బియ్యం (ఎఫ్‌సీఐ) మిగిలిన వాటిని రోజువారీగా, వారం వారీగా లక్ష్యా న్ని నిర్దేశించి ఆగస్టు నెల 15వ తేదీ లోపల మిల్లర్ డెలివరీ చేయాలని ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి పౌర సరఫరాల మేనేజర్ డీఎం(సీ.ఎస్), డీటీ(ఎన్ఫోర్స్‌మెంట్) నిరంతర పర్యవేక్షణ జరిపి త్వరగా సీఎంఆర్ టార్గెట్స్ పూర్తిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా సీఎంఆర్ మొదలుపెట్టని రైసమిల్లర్లకు సీఎంఆర్ మొదలుపెట్టి త్వరగా ఎఫ్‌సీఐకి డెలివరీ చేయాలని ఆదేశించారు. డీఎంసీఎస్ సుగుణబాయి ఉన్నారు.



కొండన్నగూడ అసైన్డ్ భూములపై విచారణ జరిపించాలి

షాద్‌నగర్ రూరల్, జూలై 26: ఫరూఖ్‌నగర్ మండలం పరిధిలోని కొండన్న గూడలో గల అసైన్డ్ భూములపై సమగ్ర విచారణ జరిపించాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్ర వారం షాద్‌నగర్ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఒకే కుటుంబం.. ఎక్కువ భూము లను తమ అధీనంలో ఉంచుకున్నాయని ఆరోపించారు. అంతేగాకుండా నిబం ధనలకు విరుద్ధంగా భూముల్లో నుంచి మట్టిని అక్రమంగా అమ్ముకుంటున్నా రని తెలిపారు. అధికారులు సమగ్ర విచారణ చేయాలని పేర్కొన్నారు.










పంట పొలంలో జింక ప్రత్యక్షం

వికారాబాద్ అటవీ అధికారులకు అప్పగింత

చేవెళ్ల, జూలై 26 : మండల పరిధిలోని మీర్జగూడ గ్రామంలో శుక్రవారం జింక ప్రత్యక్షమైంది. గ్రామానికి చెందిన ఆవుల జంగయ్య పొలం పనులు చేస్తుండగా జింక పొలంలోకి వచ్చింది. పక్కనే ఉన్న పశువుల పాకలోకి వెళ్లడంతో ఆయన వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇచ్చాడు. దాంతో పోలీస్‌లు అక్కడికి చేరుకుని వికారాబాద్ అటవీ ప్రాంతం నుంచి జింక తప్పిపోయి వచ్చినట్లు భావించారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే, వీధికుక్కలు జింకను వెంబడించడంతో జింకకు గాయాల య్యాయి. పోలీసులు వైద్యం చేయించి వికారాబాద్ అటవీ శాఖ అధికారు లకు అప్పగించారు.







స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

ఇబ్రహీంపట్నం, జూలై 26: స్థానిక సంస్థల ఎన్నికల కోసం సీపీఐ కార్యకర్తలు సన్నద్ధం కావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని సీపీఐ కార్యా లయంలో జరిగిన యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచులుగా, వార్డుసభ్యులుగా, ఎంపీటీసీ, జెడ్పీటీసీలుగా పోటీ చేసేందుకు తగిన ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు చేస్తూనే ప్రజలకు దగ్గర కావాలన్నారు. స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తుపై అధిష్టానమే నిర్ణయిస్తుందన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు రవీంద్రాచారి, కావలి పర్సింహ, ముత్యాల యాదిరెడ్డి, పోచమోని నీలమ్మ, లక్ష్మయ్య, కృష్ణ, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంతి గృహం అసంపూర్తి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్‌కుమార్



చీమలదరిలో పీహెచ్‌సీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మోమిన్‌పేట్, జూలై 26: విశ్రాంతి గృహం అసంపూర్తి పనులకు ప్రతి పాదనలు సిద్ధం చేయాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని నూతన విశ్రాంతి గృహాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పను లను గుర్తించి ప్రతిపాదనలను కలెక్టర్ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి పాదనలు పంపిస్తే నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. భవనాన్ని నిర్మించి ఆరు సంవత్సరాలు గడుస్తున్నా నిరుపయోగంగా ఎందుకు ఉంచారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా మండల పరిధిలోని చీమలదరి గ్రామంలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సీసీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామ పంచా యతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో సీజ నల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారి శుధ్య పనులు చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ ప్రణీత్, ఎంపీడీవో యాదగిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంక ర్‌యాదవ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భవిష్యత్తు బీజేపీదే : ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

కీసర రూరల్, జులై 16: భవిష్యత్తులో రాష్ట్రంలో బీజేపీదే ప్రభుత్వ మని రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ ఉమ్మడి జిల్లాల ఉపా ధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నాగారం మున్సిపా లిటీ స్టార్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం భారతీయ జనతా పార్టీ(బీజేపీ) మేడ్చల్‌రూరల్ జిల్లా కార్యకవర్గ సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమా వేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని ఆందో ళన వ్యక్తం చేశారు. మిగులు నిధులతో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల మయం చేశారని విమర్శించారు. ఏక కాలంలోనే రూ.రెండు లక్షల వరకు రుణ మాఫీ చేస్తామని చెప్పి రూ.లక్ష లోపు వారికి కూడా మాఫీ చేయలదేని ఆరోపించారు. కౌలు రైతులకు రుణాలు అందిస్తామని ప్రగల్భాలు పలి కిన ప్రభుత్వం ఆ ఊసే ఎత్తటం లేదన్నారు. స్వల్ప కాలంలోనే కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అసమ్మతిని కూడగట్టుకుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలుచుకోవాలని బీజేపీ శ్రేణులకు సూచించారు. అనంతరం కార్గిల్ దివస్‌లో భాగంగా ఆ యుద్ధంలో పాల్గొన్న వీర జవాన్లను ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, ఘట్‌కే సర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, నాగారం మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు వేణుగోపాల్, కౌన్సి లర్లు బిజ్జ శ్రీనివాస్, లక్ష్మి, బోగారం ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, మాజీ జడ్పీ టీసీ సురేష్, నాయకులు బిక్కునాయక్, చిత్తరంజన్‌రెడ్డి, శోబారెడ్డి, బుద్ది శ్రీనివాస్, శ్యాంసుందర్‌శర్మ, ఏనుగు రాజిరెడ్డి పాల్గొన్నారు.



రైల్వే లైన్ మంజూరు చేయండి

కేంద్ర రైల్వేశాఖ మంత్రికి ఆచారి వినతి



అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆచారి

ఆమనగల్లు, జూలై 26: కేంద్ర రేల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను శుక్రవారం జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. సూర్యాపేట నుంచి నల్లగొండ, దేవరకొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ మీదుగా గద్వాల వరకు రైల్వేలైన్‌ను మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి ఆచారి వినతిపత్రం అందజేశారు. దాంతో రైల్వేలైన్ ఏర్పాటుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆచారి తెలిపారు. ఆయనతో బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ రావు, తదితరులు ఉన్నారు.



నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

దివ్యాంగుల సంక్షేమంపై చిన్నచూపు?

షాద్‌నగర్ అర్బన్, జూలై 26: రాష్ట్ర బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి నిధులు కేటాయించలేదని, వారి పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని దివ్యాంగులు నిరసన వ్యక్తం చేశారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. 2,91,159 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమం కోసం నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి, దివ్యాంగుల కోసం నిధులు కేటాయించి, పింఛన్‌ను ఆరువేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్ధానాల మేరకు దివ్యాంగులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం నాయకులు చేగూరు శేఖర్‌గౌడ్, సంతోష కుసుమ, మునీరా, మల్లేష్, నర్సింలు, అంజనేయులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కొడిచర్లతండా వాసులు

ప్రభుత్వ స్థలాన్ని క్రిష్టియన్ కమ్యూనిటీకి కేటాయించొద్దు

కొత్తూర్, జూలై 26: మండల పరిధిలోని కొడిచర్లతండాలోని సర్వే నెంబర్ 198లో గల రెండెకరాల ప్రభుత్వ భూమిని క్రిష్టియన్ కమ్యూనిటీ హాల్‌కు కేటాయించవద్దని కొడిచర్ల మాజీ ఎంపీటీసీ బి.రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో తండావాసులు శుక్రవారం తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. నూతనంగా ఏర్పడిన కొడిచర్లతండాకు గ్రామపంచాయతీ భవనం లేదని, ఉన్న ప్రభుత్వ స్థలాన్ని క్రిష్టియన్ కమ్యూనిటీ హాల్‌కు కేటాయిస్తే, ప్రభుత్వ స్థలం లేకుండా పోతుందని పేర్కొన్నారు. ఆ భూమిని గ్రామపంచాయతీ అవసరాలకు ఉపయోగించాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో కొడిచర్ల తండా మాజీ సర్పంచ్ సంతోష్‌నాయక్, నాయకులు బిచ్చునాయక్, మెహన్‌నాయక్, విష్ణునాయక్, దేవునాయక్, కుమార్‌నాయక్, సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

'ఎస్టీ డిక్లరేషన్'ను అమలు చేయాలి

రంగారెడ్డి అర్బన్, జూలై 26 : ఎస్టీ డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలని బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బనావత్ సాయిలాల్ నాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిరసన ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌డ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా 2023 ఆగస్టు 26న చేవెళ్ల బహిరంగ సభలో ప్రకటించిన ట్రైబల్ డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఇచ్చిన హామీని అమలు చేస్తానని చెప్పినా.. నేడు ఎస్టీలను విస్మరిస్తున్నారని అన్నారు. ఎస్టీ డిక్లరేషన్‌లో ప్రకటించిన అంశాలను వెంటనే అమలు చేయాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు.

బషీరాబాద్ ఠాణాకు వాస్తు దోషమట!!

ప్రధాన డోర్ మూసి ఉంచడంపై స్థానికంగా చర్చ

బషీరాబాద్, జూలై 26: బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ప్రధానద్వారం మూసి కనిపించడంతో శుక్రవారం ఫిర్యాదు చేసేందుకు వచ్చిన పలువురు అయోమయానికి గురయ్యారు. ఇదేంటి పోలీస్‌స్టేషన్ తలుపులు మూసి ఉన్నాయని, ఒక్కసారిగా ఆలోచనలో పడి దిక్కులు చూడాల్సి వచ్చింది. అప్పటికే పక్కన గది డోర్‌లోంచి పోలీసుల రాకను చూసి లోపలికి వెళ్లి అక్కడ ఏర్పాటు ఛాంబర్‌లో ఫిర్యాదులు అందజేశారు. ఇటీవల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఓ ఉన్నతాధికారి ఈ పోలీస్‌స్టేషన్‌కు వాస్తుదోషం ఉందని చెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో వాస్తు కోసమే పోలీసులు ప్రధాన ద్వారం నుంచి రాకపోకలు బంద్ చేసినట్లు పలువురు గుసగుసలాడుకున్నారు. ఈ విషయం స్థానిక ప్రజల్లో చర్చనీయంశమైంది.



పోలీస్‌స్టేషన్ ప్రధానం ద్వారం మూసి ఉంచిన దృశ్యం

ఘనంగా పోచమ్మ బోనాలు

చౌదరిగూడ/కొందుర్గు, జూలై 26: జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని చేగిరెడ్డి ఘణాపూర్, గుంజల్‌పహాడ్, జిల్లేడ్, రావిర్యాల, తుమ్మలపల్లి పెద్ద ఎల్కిచర్ల, కాస్లాబాద్, లచ్చంపేట్ తదితర గ్రామాల్లో శుక్రవారం పోచమ్మ దేవతకు బోనాలను ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఇంటి నుంచి బోనాన్ని తయారు చేసుకొని మహిళలు ఆలయానికి బయల్దేరారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. యువకుల కేరింతలు, ఆట పాటలు, నృత్యాలు విన్యాసాల మధ్య బోనాల ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులందరూ పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. వర్షాలు బాగా కురిపించి ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు.



పర్వతాపూర్‌లో బోనాలతో మహిళలు

కొందుర్గు మండలంలో..

కొందుర్గు మండలం పర్వతాపూర్, చిన్నఎల్కిచర్ల, తంగళ్ళపల్లి గ్రామాల్లో శుక్రవారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పర్వతాపూర్‌లో మైసమ్మ, చిన్నఎల్కిచర్లలో పోశమ్మ, తంగళ్లపల్లిలో మైసమ్మ, పోచమ్మ గ్రామ దేవతలకు మహిళలు బోనాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఆయా గ్రామాల్లో ఊరేగింపుగా వెళ్ళిన మహిళలు గ్రామ దేవతల దేవాలయాల చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేసి, నైవేద్యం సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో వివిధ పార్టీల డాక్టర్ వెంకటేష్, రవికుమార్, శేఖర్, రఘుయాదవ్, మల్లేష్ గౌడ్, డి. రాంచంద్రయ్య, గోవర్ధన్‌గౌడ్, కె శంకర్‌జీ, శంకర్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, నర్సింలు, రామకృష్ణ, వెంకటేష్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తుమ్మలపల్లిలో బోనాలతో ఆలయానికి బయల్దేరిన మహిళలు,గ్రామస్తులు

కొత్త భవనం ప్రారంభమెన్నడో?

- శిథిలావస్థలో పాత అంగన్‌వాడీ భవనం
- వర్షానికి ఉరుస్తూ పెచ్చులూడుతున్న వైనం
- కొత్త భవనానికి తాళం
- అంగన్‌వాడీ పిల్లలకు అవస్థలు

ధారూరు, జూలై 26: పిల్లల కోసం ప్రభుత్వం కొత్తగా అంగన్‌వాడీ భవనం నిర్మించినా ప్రారంభానికి నోచుకోవడంలేదు. దీంతో పాత అంగన్‌వాడీ భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటికే పాతభవనం శిథిలావస్థకు చేరుకుంది. దీనికి తోడు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పాతభవనంలో ఊరుస్తూ పెచ్చులూడుతున్నాయి. మండలంలోని అవుసుపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ భవనం పరిస్థితి ఇది. గ్రామంలోని శిథిలావస్థలో ఉన్న భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. వర్షాలకు గురువారం భవనం ఉరుస్తూ పైనుంచి పెచ్చులు ఊడిపడ్డాయి. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు కూర్చునే గదిలో పెచ్చులు ఊడిపడి గదిలో వర్షపునీరు కారుతోంది. దీంతో అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు కూర్చోవటానికి ఇబ్బందిగా మారింది. పెచ్చులూడి పిల్లల మీద పడితే ప్రమాదం జరిగే అవకాశముందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



అవుసుపల్లిలో పెచ్చులుడుతున్న అంగన్‌వాడీ భవనం

కొత్త అంగన్‌వాడీ భవనానికి తాళం

కొత్తగా నిర్మించిన అంగన్‌వాడీ భవనం తాళం వేసి ఉంది. ఈ భవన నిర్మాణం పూర్తయి ఏడాది గడుస్తున్నా సంబంధిత అధికారులు ఈ భవనాన్ని స్వాధీనం చేసుకుని ప్రారంభించలేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో శిథిలావస్థలో ఉన్న భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారని వారు చెప్పారు. కాగా ఈ భవనం నిర్మించిన కాంట్రాక్టర్ భవన నిర్మాణం పనుల డబ్బులు చెల్లించలేదని అంగన్‌వాడీ భవనాన్ని తాళం వేసినట్లు తెలిసింది. నిర్మాణం పూర్తయిన అంగన్‌వాడీ భవనాన్ని అధికారులు అందుబాటులోకి తీసుకురాకుండా జాప్యం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.



అవుసుపల్లిలో తాళం వేసిన ఉన్న కొత్త అంగన్‌వాడీ భవనం

శిథిలావస్థలో పాఠశాల భవనాలు

కొడంగల్, జూలై 26: కొడంగల్ మున్సిపల్ పరిధిలోని కొండారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థలో ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురుస్తుండటంతో పాఠశాల తరగతి గదుల్లోకి వర్షపు నీరు చేరుతుందని, దీంతో విద్యార్థులను పాఠశాల వరండాలో కూర్చొబెట్టి ఉపాధ్యాయులు పాఠాలు బోధించాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోయారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని తొలగించి నూతన భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.



కొండారెడ్డిపల్లి పాఠశాల ఆవరణలో విద్యార్థులు

కులకచర్ల: చౌడాపూర్ మండలంలోని మరికల్ జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల ఆవరణలోకి వర్షపు నీరుచేరింది. దీంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నపాటి వర్షం కురిసినా పాఠశాల ఆవరణ మొత్తం చిత్తడిగా మారుతుంది. బురదలోనే విద్యార్థులు ప్రార్థన, ప్రతిజ్ఞ చేస్తున్నారు. బయటి నుంచి పాఠశాల లోపలికి వెళ్లేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిల్వ ఉన్న నీటిలో క్రిమికీటకాలు పెరిగి దుర్గంధం వెదజల్లుతోంది. విద్యార్థులు వ్యాధుల బారిన పడకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండులు కోరుతున్నారు.



మరికల్ ఉన్నత పాఠశాల ముందు నిల్వ నీటిలో నుంచి వెళ్తున్న విద్యార్థులు



పెంజర్లఓ పల్లె ప్రకృతివనాన్ని పరిశీలిస్తున్న సీఈవో కృష్ణారెడ్డి

వనమహోత్సవ లక్ష్యాన్ని పూర్తి చేయాలి

జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

కొత్తూర్, జూలై 26: వనమహోత్సవ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు మండల, గ్రామాధికారులు కృషి చేయాలని జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి సూచించారు. మండల పరిధిలోని పెంజర్ల గ్రామ పంచాయతీని కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పింఛన్ల పంపిణీ, పల్లె ప్రగతి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ వనమహోత్సవ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాల్గొని విరివిగా మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు కృషి చేయాలన్నారు. మండలానికి నిర్దేశించిన లక్ష్యాన్ని మించి మొక్కలు నాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో విజయలక్ష్మీ, గ్రామ కార్యదర్శి సురేందర్, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్‌ను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆమనగల్లు అభివృద్ధి పై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష

అసంపూర్తి పనులు పూర్తి చేయాలి : బీఆర్‌ఎస్ నాయకులు

ఆమనగల్లు, జూలై 26: ఆమనగల్లు పట్టణంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురాకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని బీఆర్‌ఎస్ నాయకులు హెచ్చరించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మేడిగడ్డ-శంకర్‌కొండ రోడ్డులో వాగుపై వంతెన నిర్మాణ అసంపూర్తి పనులను శుక్రవారం మాజీ జడ్పీటీసీ అనురాధ పత్యానాయక్ ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్‌కు రూ.4.50కోట్లు, కళాశాల భవన నిర్మాణానికి రూ.2.50 కోట్లు, మేడిగడ్డ వాగుపై వంతెన నిర్మాణానికి రూ.3.27 కోట్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం విడుదల చేసినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు విడుదల కాక.. 50 శాతానికి పైగా పనులు పూర్తయ్యాక మూడు పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రూ.17.50 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. మాజీ ఎంపీటీసీ కుమార్, సరిత పంతూనాయక్, మాజీ సర్పంచ్ సోనశ్రీనునాయక్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రమేశ్‌నాయక్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు గుత్తి బాలస్వామి, సతీష్, డేరంగుల వెంకటేశ్, భాస్కర్, శివకుమార్, ప్రసాద్, యాదయ్య, ఆనంద్, గణేశ్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

'రుణమాఫీ'ని సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు, జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పంట రుణమాఫీ డబ్బులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి అన్నారు. శుక్రవారం వ్యవసాయాధికారి లావణ్యతో కలిసి మండలంలోని కందుకూరు, గఫూర్‌గనర్, ధన్నారం, పులిమామిడి, గ్రామాల్లో పర్యటించారు. రైతుల ఇంటి వద్దకు, వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి రుణ మాఫీపై క్షేత్రస్థాయిలో అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పంటరుణ మాఫీ చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేసినట్లు ఆమె తెలిపారు. అనంతరం జైత్వారం(ఖల్సా) రెవెన్యూలో సాగుచేసిన మొక్కజొన్న, పత్తి, పంటలను పరిశీలించారు. పంటల బీమా పథకం కోసం కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులు తమ సిబ్బందికి ధ్రువపత్రాలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు ఎల్.రాజు, జె.శ్రీహరి రైతులు పాల్గొన్నారు.



పులిమామిడిలో రైతులతో మాట్లాడుతున్న గీతారెడ్డి



సీఎం పర్యటనకు భారీగా ఏర్పాట్లు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై 26: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 28న కల్వకుర్తి పర్యటన నేపథ్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. సీఎం బహిరంగ సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి 20 వేల జనసమీకరణ చేస్తున్నట్లు చెప్పారు. సీఎం సభ ఏర్పాట్లును శుక్రవారం ఆర్డీవో శ్రీను, అధికారులు, నాయకులతో కలిసి నారాయణరెడ్డి పరిశీలించారు. సీఎం ఆవిష్కరించనున్న కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి విగ్రహాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 28న మధ్యాహ్నం 3.30 గంటలకు సీఎం కొట్ర గేటుకు చేరుకుంటారని, జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ అనంతరం 4 గంటలకు కల్వకుర్తిలో జరిగే బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారని చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి, ప్రత్యేక నిధుల మంజూరు గూర్చి సీఎంను కోరనున్నట్లు కసిరెడ్డి చెప్పారు. సీఎం సభ విజయవంతాన్ని నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కోరారు. నాయకులు భూపతిరెడ్డి, ఆనంద్, రామకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, సాయిరెడ్డి, మనోహర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి తీవ్ర పోటీ

- త్వరలో కొలువుదీరనున్న మహేశ్వరం మార్కెట్ కమిటీ పాలకవర్గం
- ఎస్టీ జనరల్‌కు కేటాయించడంతో ఆశావహుల ముమ్మర యత్నాలు
- కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నం
- నువ్వా-నేనా అనేలా.. కృష్ణానాయక్, రాజునాయక్



రాజు నాయక్



కృష్ణానాయక్

మహేశ్వరం, జూలై 26 : ఏడు నెలలుగా మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గం లేక రైతులకు అందాల్సిన సేవలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఇటు పాలకవర్గం లేకపోవడంతో పాటు ప్రభుత్వ పర్యవేక్షణ కూడా లేక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కోక తప్పడంలేదు. మార్కెట్ కమిటీ పాలకవర్గం ఎప్పుడు ఏర్పాటు చేస్తారోనని వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. త్వరగా ఏర్పాటు చేయాలని మహేశ్వరం, కందుకూరు మండలాల రైతులు మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్‌తో పాటు పలువురు నేతలను ఆశ్రయిస్తున్నారు. పాత కమిటీలను ప్రభుత్వం రద్దు చేయడంతో నూతన కమిటీ ఏర్పాటు కాకపోవడంతో వ్యవసాయ మార్కెట్‌కమిటీ పాలన గందరగోళంగా తయారైంది. అదేవిధంగా మహేశ్వరం మార్కెట్ కమిటీ రిజర్వేషన్లను అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2015-16లోనే 5 విడతలుగా ఒకేసారి లాటరీ పద్దతిన ప్రకటించారు. ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ నుంచి 2015లో విడిపోయి నూతనంగా ఏర్పాటైన మహేశ్వరం మార్కెట్‌కమిటీకి రెండు పర్యాయాలు జనరల్ మహిళ, మూడో విడత జనరల్, నాలుగో విడత ఎస్టీ జనరల్, ఐదో విడత జనరల్ మహిళకు రిజర్వేషన్లను కేటాయించారు. ప్రస్తుతం కొలువుదీరనున్న మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్టీ జనరల్‌కు రిజర్వేషన్ కావడంతో కందుకూరు, మహేశ్వరం మండలాలకు చెందిన అధికార పార్టీ నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకుంటూ ఎంతో కాలంగా పార్టీ కోసం తాము చేసిన కృషిని వివరిస్తూ ప్రయత్నాలు చేస్తున్నారు.

రేసులో ఉన్న గిరిజన నేతలు

మహేశ్వరం మండలానికి చెందిన అంగోత్ కృష్ణానాయక్, నేనావత్ రాజు నాయక్, పాండునాయక్, అంద్యానాయక్, రాములునాయక్‌లు, కందుకూరు మండలం నుంచి ఆంజనేయులునాయక్, లచ్చానాయక్, కృష్ణానాయక్‌లు చైర్మన్ పదవి కోసం తీవ్రంగా పోటీ పడుతున్నారు. మహేశ్వరం మండలానికి చెందిన కృష్ణానాయియక్, రాజునాయక్‌లు చైర్మన్ పదవి కోసం నువ్వా, నేనా అనే రీతిలో కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద ఎవరి ప్రయత్నాలు వారు ముమ్మరం చేశారు.



మూడు విడతలూ కందుకూరుకే..

మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీని 2015-16 లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మూడు విడతలుగా కందుకూరు మండలానికి చెందిన నేతలకే కేటాయించడంతో ఈసారి మహేశ్వరం మండలానికి చెందిన నాయకులకే చైర్మన్ పదవి వరించనుంది. కాగా, మహేశ్వరం మండలానికి చెందిన పలు గ్రామాల గిరిజన కాంగ్రెస్ నేతలు చైర్మన్ గిరిని దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

స్థానిక ' ఎన్నికలకు మజ్లిస్ సమాయత్తం..!

నేడు కొడంగల్‌లో కార్యకర్తలతో సమావేశం కానున్న ఒవైసీ

హైదరాబాద్,జులై 26(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయితీ, తదితర స్థానిక సంస్థల ఎన్నికల కోసం మజ్లిస్ పార్టీ కార్యకర్తలను సంసిద్ధం చేస్తోంది. మరో నెల రెండు నెలల్లో ఎన్నికలు జరుగనున్నందున ఆయా ప్రాంతాల్లోని ఓటు బ్యాంకు మైనారిటీ వర్గాలను సమన్వయం చేసుకునేందుకు మజ్లిస్ పార్టీ యంత్రాంగం విస్తృత స్థాయిలో సన్నహాలు ప్రారంభించింది. ఇటీవలి కాలం వరకు బీఆర్‌ఎస్‌తో మిత్ర పక్షంగా వ్యవహరించిన మజ్లిస్ క్రమంగా ఆ పార్టీకి దూరమై కాంగ్రెస్ పంచన చేరుతోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ ఉనికి తగ్గిపోయి ఆ స్థానంలో బీజెపీ ప్రభావం పెరుగడంతో మజ్లిస్ పార్టీ అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో సిద్దాంత పరంగా రాజకీయంగా తీవ్రంగా విభేధించే బీజెపీ విస్తరించకుండా అడ్డుకునేందుకు మజ్లిస్ ప్రయత్నాలు ప్రారంభించింది. ఆయా ప్రాంతాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మైనారిటీ వర్గాలు ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు వీలుగా రాజకీయంగా నిర్ణయాలు తీసుకోవాలని మజ్లిస్ అధినాయకత్వం సంకేతాలు పంపినట్టు తెలిసింది. ఇందులో భాగంగా శనివారం వికారాబాద్ జిల్లా కొడంగల్ ప్రాంతంలో మజ్లిస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాల్గొంటారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ప్రధానంగా మైనారిటీ వర్గాల ఓటర్లు అధికంగా నివసించే ప్రాంతాల్లో ఓట్లు చీలిపోకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర వర్గాలను సమన్వయం చేసుకుని స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు మజ్లిస్ పార్టీ వ్యూహం రూపొందిస్తున్నట్టు తెలిసింది. ఆతర్వాత జిల్లాల వారీగా పార్టీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించాలని పార్టీ ఎమ్మెల్యేలకు సూచించినట్టు సమాచారం.

'హార్ట్‌ఫుల్‌నెస్' ఆధ్వర్యంలో ఒలంపిక్ క్రీడాకారులకు ధ్యాన తరగతులు

నందిగామ, జూలై 27: మండల పరిధిలోని కన్హా శాంతివనంలోని రాంచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ రిలయన్స్ ఫౌండేషన్ సహకారంతో పారిస్‌లో జరిగే ఒలంపిక్ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు ధ్యాన తరగతులు నిర్వహిస్తున్నట్లు హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 29 నుంచి ఆగస్టు 1 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధ్యానంతో క్రీడాకారులకు మానసిక ప్రశాంతతో పాటు, కొత్త ఆలోచనలకు పదును పెట్టడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. క్రీడాకారులు సంతృప్తికర క్రీడా ప్రదర్శన చేసేందుకు ఈ కార్యక్రమం ఎంతో సహకరిస్తుందన్నారు.


కులకచర్ల: తిరుమలాపూర్‌లో బోనాలు తీసుకెళుతున్న మహిళలు


బొంరాస్‌పేట్: మెట్లకుంటలో బోనాలు తీసుకెళుతున్న మహిళలు


ధారూరు: చింతకుంటలో బోనాలతో బొడ్రాయి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు


పెద్దేముల్: కందనెల్లి గ్రామంలో బోనాలతో బయలుదేరిన మహిళలు

భక్తిశ్రద్ధలతో అమ్మోర్లకు బోనం

పెద్దేముల్, జూలై 26: ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని పలు గ్రామాల్లో అమ్మవార్లకు మహిళలు బోనాలతో నైవేద్యాలు సమర్పించారు. మండలంలోని కందనెల్లి గ్రామంలో బోనమ్మ, ఊరడమ్మ, మంబాపూర్ గ్రామంలో కట్టమైసమ్మ దేవతలకు బోనాల జాతర నిర్వహించారు. మహిళలు అమ్మవార్లకు సమర్పించేందుకు పిండివంటలతో తయారు చేసిన నైవేద్యాలను బోనాలతో తీసుకెళ్లారు. బోనంనెత్తిన ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. ఊరువాడా బాగుండాలని కోరుకున్నారు. పాడిపంట బాగుండాలని మొక్కుకున్నారు.

కులకచర్ల: మండలంలోని తిరుమలాపూర్, ఘనపూర్, చాపలగూడెం, ఇప్పయిపల్లి, రాంపూర్, అంతారం, పుట్టపహాడ్ తదితర గ్రామాల్లో శుక్రవారం పోచమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహించడంతో పాటు తెప్పోత్సం, బోనాలతో మహిళలు నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం మహిళలు కుంకుమ, పసుపు, గంధం, వేపాకు, పూలు తదితర వాటితో అందంగా అలంకరించిన బోనాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండల పరిధిలోని మెట్లకుంట గ్రామంలో శుక్రవారం గ్రామస్థులు పోచమ్మ దేవతకు బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో గ్రామంలోని పురవీధుల మీదుగా ఊరేగింపుగా బయలుదేరి ఆలయంలో ప్రత్యేక నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని గ్రామస్థులు కోరుకున్నారు.

ధారూరు: మండల పరిధిలోని ధారూరు, చింతకుంట గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం గ్రామ దేవత పోచమ్మకు బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మ దేవతకు అభిషేకాలు చేసి, ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం మహిళలు బోనాలతో అమ్మవారికి ఆలయం, బొడ్రాయి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించి పాడి పంటలు సమృద్ధిగా పండాలని, పిల్లాపాపలను చల్లగా చూడాలని మహిళలు మొక్కుకున్నారు.

వికారాబాద్: బోనం అంటే నైవేద్యమని, దేవుళ్లకు నైవేద్యం సమర్పించడం సాంప్రదాయంగా వస్తుందని వివేకావాణి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం నాగయ్య తెలిపారు. పాఠశాలలో శుక్రవారం బోనాల పండుగ నిర్వహించగా చిన్నారులు బోనం ఎత్తుకోగా పోతురాజు విన్యాసాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు నాగయ్య, కోశాధికారి శ్రీనివాస్, ప్రసాద్, కాలనీవాసులు లక్ష్మన్, బుస్సా శ్రీకాంత్, కన్నయ్య, ప్రభు, అమర్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.


వికారాబాద్: బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న వివేకావాణి విద్యార్థులు

ఉపాధ్యాయులు శ్రద్ధతో బోధించాలి


మాట్లాడుతున్న డీఈవో విజయకుమారి

మేడ్చల్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) జూలై 26: ఉపాధ్యాయులు విద్యార్థులకు శ్రద్ధతో బోధించాలని జిల్లా విద్యాధికారి విజయకుమారి తెలిపారు. డీఈవో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅథితిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతిలో బోధించాలన్నారు. ప్రాథమిక స్థాయిలో శక్తిసామర్థ్యాల సాధన పెంపునకు కృషిచేయాలని జిల్లాలోని రిసోర్స్ పర్సన్‌లకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో జిల్లాను ఉన్నత స్థాయిలో నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రవీందర్, అధికారులు సురేష్, హెచ్‌ఎంలు, జిల్లాస్థాయి కాంప్లెక్స్ రిసోర్స్‌పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడిగా భాను ప్రకాశ్


భాను ప్రకాశ్

వికారాబాద్, జూలై 26: బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడిగా భానుప్రకాశ్‌ను పార్టీ పెద్దలు నియమించారు. బీజేపీ కార్యాలయం నుంచి జిల్లాల వారీగా విడుదల చేసిన పేరులో జిల్లా అధ్యక్షుడిగా భానుప్రకాశ్‌కు అవకాశం కల్పించారు. భాను ప్రకాశ్ రంగారెడ్డి జిల్లా టంగుటూర్ ప్రాంతానికి చెందిన వారు కాగా పార్టీ జిల్లా ఓబీసీ బాధ్యతలను అప్పగించింది.

లైంగికదాడి బాధితులకు అండగా భరోసా సెంటర్



మేడ్చల్ భరోసాసెంటర్‌లో సృజన కర్నమ్, సిబ్బంది

మేడ్చల్ టౌన్, జూలై 26: లైంగికదాడి బాధితులకు ఆత్మవిశ్వాసాన్ని పెంచి ధైర్యంగా పరిస్థితులను ఎదుర్కునే విధంగా భరోసా సెంటర్లు అండగా నిలుస్తున్నాయని ఉమెన్ అండ్ చిల్డ్రన్స్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కర్నమ్ అన్నారు. మేడ్చల్‌లో ఏర్పాటు చేసిన భరోసాసెంటర్ రెండవ వార్షికోత్సవం సందర్భంగా ఆమె శుక్రవారం మేడ్చల్ భరోసా సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా భరోసా సెంటర్‌లో ఉన్న కేసులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్‌టీయూఇన్‌స్పెక్టర్ జమేష్ బాబు, భరోసాసెంటర్ కోఆర్డినేటర్ కళ్యాణి పాల్గొన్నారు.

రోడ్డును బాగు చేయించండి

తాండూరు, జూలై 26: తాండూరు-వికారాబాద్ రోడ్డు నిర్మాణం త్వరగా చేపట్టి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డికి రాజీవ్ గాంధీ ఫ్రూట్స్, వెజ్ వెండర్స్ కో-ఆపరేటివ్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఆయన కలిసి రోడ్డు పరిస్థితిని వివరించారు. ప్రజలు, వాహనదారులు రోడ్డు గుంతలతో ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. హైదరాబాద్‌కు అంబులెన్స్‌లలో రోగులను తరలిస్తున్న సయమంలో అంబులెన్స్ డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం చైర్మన్ మహమ్మద్ సమీర్ అహ్మద్, ఉర్దూ ఘర్ మాజీ చైర్మన్ అబ్దుల్ రజాక్, మైనార్టీ ఉపాధ్యక్షులు మహమ్మద్ రఫీక్ ఖాన్‌లు ఉన్నారు.

'బడ్జెట్ కేటాయింపు కాదు.. ఖర్చు చేయాలి'

పరిగి, జూలై 26: వివిధ రంగాలకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం మాత్రమే కాదని, వాటిని పూర్తిస్థాయిలో ఖర్చు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదేళ్లలో కేటాయింపులు జరిగినప్పటికీ పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేదన్నారు. దళిత, గిరిజనులకు ప్రణాళికలో ఏనాడూ 60శాతానికి మించి ఖర్చు చేయలేదన్నారు. వ్యవసాయరంగానికి రూ.72,659కోట్లు కేటాయించారని, విద్య, వైద్య రంగానికి గతంలో మాదిరిగానే జరిగిందన్నారు.

రాయిలాపూర్‌లో ఉచిత వైద్యశిబిరం

మేడ్చల్ టౌన్, జూలై 26: రాయిలాపూర్‌లో శుక్రవారం మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 100మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మోకాళ్ల, కీళ్ల నొప్పులు, బీపీ, షుగర్ రోగాలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ నర్మద గోపాల్‌రెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ మూర్తి, డాక్టర్ మనీషా, డాక్టర్ సంధ్య పాల్గొన్నారు.

ఫిజియోథెరపిస్ట్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూలై 26: జిల్లాలోని మోమిన్‌పేట, మర్పల్లి, నవాబుపేట, వికారాబాద్, ధారూరు, చౌడాపూర్, కోట్‌పల్లి మండలాల్లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఫిజియోథెరపి చేయడానికి అవసరమైన ఫిజియోథెరపిస్ట్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపితోపాటు పారామెడికల్ అసోసియేషన్‌లో రిజిస్ట్రేషన్ కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను జూన్ 31లోపు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో అందజేయాలని ఈ సందర్భంగా సూచించారు.

సైనికుల సేవలు ఎనలేనివి


తాండూరు: సైనికులకు సెల్యూట్ చేస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి


పరిగి:విజయ్ దివస్ ర్యాలీలో విద్యార్థులు

తాండూరు, జూలై 26: దేశరక్షణకు సైనికులు చేస్తున్న సేవలు ఎనలేనివని తాండూరు డీఎస్పీ కే.బాలకృష్ణారెడ్డి అన్నారు. ఖాంజాపూర్ గేటు సమీపంలో ఉన్న తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం కార్గిల్ దివస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 365రోజులు 24 గంటల పాటు దేశంలోని ప్రజలందరికీ రక్షణగా కంటికి రెప్పలా సైనికులు సేవలందిస్తున్నారని డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీఎం వెంకట్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రవీణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. దేశరక్షణలో భీకర పోరాటం చేసిన సన్నివేశాలు, భరతమాత వేషధారణ ఎంతగానో ఆకట్టుకున్నాయి. వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కాగా, గాంధీచౌక్ కూడలిలో కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో కాగడాలు, కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. జాతీయ జెండాలతో ర్యాలీలు తీసి సంబురాలు నిర్వహించారు. ఉద్యోగ విరమణ పొందిన ఆర్మీ జవాన్లను సన్మానించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు నాగారం మల్లేశం, ఉపాధ్యక్షుడు మందడిరాజు, కృష్ణ, సంగమేశ్వర్, చంద్రప్రకాష్, ప్రధాన కార్యదర్శి అంతరాం కిరణ్ కుమార్, కార్యదర్శులు చందు, శివాజీ ఠాకూర్, కావలి కృష్ణ, నాయకులు ప్లహద్‌జాదవ్, పోల శ్రీనివాస్, ప్రభాకర్‌గౌడ్, రాజు, మైనార్టీ మోర్చా నాయకులు షాబుద్దీన్, రిటైర్డ్ ఆర్మీ జవాన్లు ప్రభాకర్‌రెడ్డి, రాజశేఖర్, లాలప్ప, నవాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం పల్లవి డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ 1999 జూలై 26న కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని పట్టణంలో బ్యాండ్‌మేళాతో భారీ ర్యాలీ నిర్వహించారు. అమరులైన సాయిధ బలగాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తేజేశ్వర్, ఎన్‌సీసీ అధికారి బస్వరాజు, హవాల్దార్ నారాయణ గౌడ్ పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేయొద్దు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్

తాండూరు, జూలై 26: పట్టణ ప్రజలు రోడ్లపై చెత్తను ఎక్కడబడితే అక్కడ చెత్త వేయొద్దని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ కోరారు. ఫ్రైడే - డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గొల్ల చెరువు ప్రాంతంలో ప్రజలతో మాట్లాడారు. ఇళ్లలో ఉన్న చెత్తను మున్సిపల్ ఆటోలకు అందజేయాలని మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, వార్డు కౌన్సిలర్ రామకృష్ణ(రాము), మున్సిపల్ సిబ్బంది ప్రవీణ్ కుమార్‌గౌడ్, జవాన్ సుభాష్ పాల్గొన్నారు.

పెద్దేముల్: గ్రామంలో పారిశుధ్య పనులు పక్కాగా జరిపించాలని గ్రామప్రత్యేకాధికారి తహశీల్దారు కిషన్ అన్నారు. మండలంలోని ఇందూరు గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. కొంత మందికి మిషన్ భగీరథ నీరురావడం లేదని, మరికొందరు వీధిలైట్లు లేవని ఫిర్యాదులు చేశారు. దీంతో తహసీల్దార్ కిషన్ పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచులు మొగులప్ప, ప్రకాశం, నాయకులు నరేందర్, బంధ్యప్ప పాల్గొన్నారు.

బషీరాబాద్: విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామ కార్యదర్శులు అప్రమత్తంగా ఉంటూ తగిన చర్యలు తీసుకోవాలని బషీరాబాద్ మండల ప్రత్యేకాధికారి వీరభద్రరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో జి.యాదయ్యతో కలిసి కార్యదర్శులు, ఉపాధి హామీ అధికార, సిబ్బందితో గ్రామాల వారీగా ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కార్యదర్శులు, ఎపీవో శారద, ఈసీ నర్సింహారెడ్డి, టీఏలు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు అండగా కల్యాణలక్ష్మి

కొడంగల్, జూలై 26: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అండగా నిలుస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్‌లు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. అంగడిరైచూర్‌లో తొమ్మిది మంది, అన్నారంలో నలుగురు, అప్పాయిపల్లిలో ఇద్దరు, చిన్న నందిగామలో ఐదుగురు, చిట్లపల్లిలో ఎనిమిది మంది, కస్తూర్‌పల్లిలో ఆరుగురు, కొడంగల్‌లో 35మంది, నాగారంలో ఇద్దరు, పర్సాపూర్‌లో ఎనిమిది మంది, పెద్దనందిగామలో ఒకరు, ప్యాలమద్దిలో ముగ్గురు, రావుల్‌పల్లిలో ఎనిమిది మంది, రుద్రారంలో ఎనిమిది మంది, టేకుల్‌కోడ్‌లో ఐదుగురు, ఉడిమేశ్వరంలో ఒకరికి కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముస్తాక్, ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: రుద్రారం గ్రామంలో నెలకొన్న సమస్యలను కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి గ్రామస్థులతో అడిగి తెలుసుకున్నారు. ఇటీవలే గ్రామస్థులు గ్రామంలో పాఠశాల భవనం, ఉపాధ్యాయుల కొరత, ప్రహరి నిర్మాణం, రోడ్డు తదితర సమస్యల గురించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు శుక్రవారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి గ్రామానికి చేరుకొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నంద్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **కొడంగల్ రూరల్:** హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ శనివారం కొడంగల్‌కు రానున్నట్లు పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్కీగుల్షన్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం(నేడు) మధ్యాహ్నం 2గంటలకు రెడ్డి బసిరెడ్డి గార్డెన్‌లో జరిగే సమావేశంలో వారు పాల్గొంటారని తెలిపారు.

● **పూడూరు:** మిట్టకంకల్‌కు చెందిన చిన్న బందయ్య స్థానిక పోచమ్మ ఆలయానికి తన సొంత నిధులతో రంగులు వేయించారు. ఆలయ అభివృద్ధిలో తన వంతు సహకారం అందించిన బందయ్యను గ్రామస్తులు శుక్రవారం శాలువాతో సన్మానించారు.

● **కులకచర్ల:** కులకచర్ల గ్రామ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ మురళీధర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలతో మాట్లాడారు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రంలో నిల్వ ఉన్న సరుకులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ లత పాల్గొన్నారు.

● **కులకచర్ల:** అంతారం గ్రామంలో శుక్రవారం ఎంపీడీవో రామకృష్ణ పర్యటించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. శానిటేషన్, డ్రికింగ్ వాటర్, అమ్మ ఆదర్శ పాఠశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎల్లమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రమౌళి పాల్గొన్నారు.

● **కులకచర్ల:** స్థానిక కేజీబీవీలో వైద్యురాలు మాధురి జేఈ (జపనీస్ ఎన్సెపాలిటీస్) వ్యాక్సినేషన్ శిబిరం నిర్వహించి 226 మంది బాలికలకు, ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 180 మందికి టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో చంద్రప్రకాశ్, ప్రిన్సిపాల్ దేవి, హెచ్‌ఎంలు జైపాల్‌రెడ్డి, సుందర్‌రాజు పాల్గొన్నారు.

● **తాండూరు రూరల్:** కరన్‌కోట్‌కు చెందిన యువనాయకుడు బోయ అశోక్ సోదరుడు శ్రీనివాస్‌ను తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పరామర్శించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్‌ను రోహిత్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట బోయ అశోక్ ఉన్నారు.

● **తాండూరు రూరల్:** అంతారం రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఏడీ రుద్రమూర్తి శుక్రవారం ఏవో, ఏఈవోలతో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు.రైతు బీమాలో ఏదైనా తప్పులు ఉంటే ఈనెల 30 వరకు సరి చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో మండలాల ఏఈవోలు రజిత, నసీరుద్దీన్, యాదగిరి, సూర్యప్రకాష్ ఉన్నారు.

● **యాలాల:** అన్నాసాగర్ గేట్ దగ్గర గ్రామానికి చెందిన పొంగి శాంతు ఏర్పాటు చేసిన రాయల్ ఫుడ్ హోటల్‌ను ఆర్బిఎల్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణరెడ్డి, రమ్యానాయక్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

● **ధారూరు:** కేరెల్లి శ్రీసత్యసాయి సార్వజనీక కేంద్రంలో రేపు(ఆదివారం) ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు కేంద్రం బాధ్యుడు ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సావిత్రమ్మ మోమోరియల్ చారిటబుల్ ట్రస్టు, శ్రీ సత్యసాయిసేవా సంస్థలు, సాధూరాం కంటి వైద్యశాల హైదరబాద్ వారి సౌజన్యంతో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ శిబిరం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు.

● **శామీర్‌పేట:** అలియాబాద్‌లోని ప్రభుత్వ పల్లె దవఖాన(ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)లో అవసరమైన కొత్త వీల్ చైర్స్, టేబుల్స్, వాటర్ డిస్పెన్సరీ, మెడికల్ స్టోర్ ర్యాక్స్, ఫర్నీచర్, సోలార్ వస్తువులను సీఎస్ఆర్ పథకం కింద బయోలాజికల్ ఈ లిమిటెడ్ కంపెనీ సీఈవో లక్ష్మీనారాయణ అందజేశారు. అనంతరం మాజీ సర్పంచ్ గుర్క కుమార్, గ్రామ నాయకులు వనమహోత్సవంలో మొక్కలను నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో రైతు సమితి మాజీ అధ్యక్షుడు కమఠం కృష్ణారెడ్డి, బయోలాజికల్ ఈ లిమిటెడ్ ప్రతినిధులు రుద్రరాజు ప్రభాకర్, క్రిష్ణచైతన్య, శామీర్‌పేట పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రవీందర్, డాక్టర్ సంగీత, సిబ్బంది, గ్రామనాయకులు పాల్గొన్నారు.

● **దోమ:** మండల కేంద్రానికి చెందిన బోయిని సంతోష్‌కుమార్ అగ్నిమాపక శాఖలో ఆపరేటర్ పోస్టుకు ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో తెలంగాణ ఫైర్ సర్వీస్ అండ్ సివిల్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో ఫైర్‌మెన్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో ఫైర్‌మెన్ అభ్యర్థులు నాలుగు నెలలపాటు శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా శిక్షణపూర్తి చేసుకున్న అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు సూర్యప్రకాశ్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **పరిగి:** స్థానిక జడ్పీహెచ్‌ఎస్ నెం.01లో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, డేల్ టెక్నాలజీస్ సహకారంతో శుక్రవారం సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం బుగయ్య, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, డేల్ టెక్నాలజీస్ ప్రతి నిధులు, ఉపాధ్యాయులు జి.బుచ్చిలింగం పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రూ.17లక్షల విలువైన గంజాయి పట్టివేత

● పోలీసుల అదుపులో నిందితులు


పోలీసుల అదుపులో యువకులు

మేడ్చల్‌టౌన్, జూలై 26: మేడ్చల్ ప్రాంతంలోని కళాశాలల్లో చదివే విద్యార్థులకు గంజాయి సరఫరా చేసే ముఠాను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. వారివద్ద నుంచి రూ.17లక్షలు విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రెండు రోజులుగా ఎక్సైజ్ అధికారులు గంజాయి విక్రయిస్తున్న ప్రాంతాలపై నిఘాపెట్టారు. మేడ్చల్ ప్రాంతంలో నివాసముంటున్న సుతారి గుణశేఖర్(22), చల్లమల్ల శరత్‌ల(23) గంజాయి విక్రయిస్తున్నారన్న పక్కా సమాచారంతో నిఘాపెట్టి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్దనుంచి 3.6 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ ఇరువురిని విచారించగా అవిశెట్టి అభిరాం(21), ఎర్ర ఆదిత్య(22) వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి సరఫరాచేస్తున్నట్లు ఒప్పుకున్నారు. దీంతో ఎక్సైజ్ అధికారులు అభిరాం, ఆదిత్యల నివాసాలపై దాడులు నిర్వహించారు. వారివద్ద నుంచి సుమారు రూ.13లక్షల విలువనైన 4.4 కిలోల గంజాయి లభించింది. అదేవిధంగా గుండ్లపోచంపల్లి మహంకాళి కాలనీలో ఉంటున్న పి.కార్తీక్, రాయల అరుణబాబు, ఎన్.కమల్‌ల వద్ద నుంచి 4కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజులుగా జరిపిన దాడుల్లో రూ.17లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపారు. కాగా, గుండ్లపోచంపల్లి పరిధిలోని కళాశాలల్లో చదివే విద్యార్థులకు గంజాయి విక్రయించడానికి ఈ ముఠా పనిచేసేదని తెలిపారు. ఎవరికీ అనుమానం రాకుండా స్విగ్గీ బ్యాగుల్లో గంజాయి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఐదుగురిపై కేసు నమోదు కాగా, పట్టుబడిన నలుగురు నిందితులను శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. పరారీలో ఉన్న మరొకరిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

బల్లికాదు.. ప్లాస్టిక్


రాయల్ గ్రీన్ బాటిల్‌లో వచ్చిన ప్లాస్టిక్ చూపిస్తున్న సీఐ రాగవీణ

వికారాబాద్, జూలై 26: రాయల్ గ్రీన్ మద్యంలో బల్లిఉందని ఆ మద్యం సీసా కొనుగోలు చేసిన సందీప్‌తో పాటు యువకులు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయమై శుక్రవారం సీఐ రాగవీణ మాట్లాడుతూ.. రాయల్ గ్రీన్ మద్యం సీసాలో ఉన్నది బల్లి కాదని, అది ప్లాస్టిక్ అని స్పష్టం చేశారు. అనంతగిరి వైన్స్‌లో రాయల్ గ్రీన్ కొనుగోలు చేయగా అందులో ప్లాస్టిక్ పడిఉందని అది చూసిన యువకులు బల్లి అనుకుని మీడియాకు సమాచారం ఇచ్చారు. ఫిర్యాదు అందడంతో ఈ విషయం ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్ భాస్కర్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లి వారి సమక్షంలో బాటిల్‌ను ఓపెన్‌చేసి చూసినట్లు తెలిపారు. అయితే, అందులో అందులో బాటిల్ పై భాగం ప్లాస్టిక్ మూత వేడి కారణంగా లోపలికి వెళ్లిందని తెలిపారు. పై నుంచి సీల్ చేయడం వల్ల మద్యంలో ప్లాస్టిక్ అలాగే పడిపోయినట్లుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ విషయంపై ఫిర్యాదు చేసిన సందీప్ అతడి మిత్రులకు కూడా తెలియజేశామని తెలిపారు. ఎవరూ భయపడొద్దని సూచించారు.

ఎక్మాయి శివారులో నక్కల దాడి.. పలువురికి గాయాలు

బషీరాబాద్, జూలై 26: పంటల పొలాలకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు, ఓ మహిళపై నక్కలు దాడి చేయడంతో తీవ్ర రక్త గాయాలపాలై ఆస్పత్రి పాలయ్యారు. ఈ ఘటన బషీరాబాద్ మండలం ఎక్మాయి శివారులో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. గ్రామానికి చెందిన కరణ్‌కోట్ నవాజ్‌రెడ్డి, బసమ్మ, తుప్పుడు మహిపాల్ పంట పొలాలకు వెళ్లారు. ఈ క్రమంలో మూడు నక్కలు గుంపుగా వచ్చి వీరిపై వేర్వేరు చోట్ల దాడికి దిగాయి. ఈ ఘటనలో వారి చేతులు, కాళ్ల, నోటి భాగాల్లో గాట్లుపడ్డాయి. ఇద్దరు రైతులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ దాడిలో మహిళ ముఖంపై నక్కలు గాట్లు వేయగా ఆమెను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. నక్కల దాడిలో గాయాలైన వారు పంట పొలాల్లోంచి భయందోళనతో ఊర్లోకి పరుగెత్తుకొచ్చినట్లు బాధిత కుటింబీకులు, స్థానికులు వాపోయారు. గ్రామశివారులో మృత్యువాతపడిన ఎద్దు కళేబరాలను నక్కలు తిని పిచ్చేక్కి పొలాల్లో తిరుగుతున్నాయని రైతులు పలువురు ఆందోళన వ్యక్తంచేశారు. బాధితులను తాండూరు జిల్లా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సంబంధిత అధికారులు నక్కల బారినుంచి తమను రక్షించాలని కోరుతున్నారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం


పీసు వెంకట్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, జూలై 26: బీటెక్ విద్యార్థి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా అర్మూర్‌కు చెందిన పీసు వెంకట్‌రెడ్డి, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఈడబ్ల్యుఎస్ కాలనీలో అద్దెకుంటూ భోగారంలోని హోలీమేరీ కాలేజ్‌లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 25వ తేదీన గదిలో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో వెంకట్‌రెడ్డి స్నేహితులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అతడి మామ జక్క మనోహర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తండ్రి ఆస్తి కాజేశారని కూతురు ఫిర్యాదు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 26: హత్యకు గురైన తన తండ్రి ఆస్తిని కాజేశారని గడ్డం మహేష్ అనే వ్యక్తి కూతురు గడ్డం తరుణి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత నెల 15న హత్యకు గురైన గడ్డం మహేష్‌కు సంబంధించిన బీరువాలోని డబ్బులు, ప్లాట్ల పేపర్లు, బంగారం, బుల్లెట్ బైక్‌లను బాబాయ్ గడ్డం విట్టల్ ఎత్తుకెళ్లారని తెలిపారు. పలుమార్లు అడిగినా తమకు ఇవ్వడం లేదని తరుణి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థికి తీవ్రగాయాలు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 26: బైక్‌పై వెళ్తూ లారీని వెనుక నుంచి ఢీకొన్న ప్రమాదంలో ఓ బీటెక్ విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి-భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం, జైనపల్లికి చెందిన శ్రీచరణ్(19) ఘట్‌కేసర్ మండలం, అంకుషాపూర్‌లోని ఏసీఈ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం కళాశాల నుంచి జైనపల్లికి వెళుతుండగా హెచ్‌పీసీఎల్ సమీపంలో ముందు వెళుతున్న లారీని వెనుకాల నుంచి ఢీకొట్టాడు. ఈప్రమాదంలో శ్రీచరణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి రూ.10వేల జరిమానా

● తాండూరు కోర్టులో తీర్పు

బషీరాబాద్, జూలై 26: ఓ విద్యార్థి చేతికి కట్టుకున్న దారాన్ని తీసివేయాలని ఆదేశించిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి తాండూరు కోర్టులో న్యాయాధికారి రూ.10వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పినట్లు బషీరాబాద్ ఎస్ఐ రమేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని మైల్వార్ గ్రామం ప్రభుత్వ పాఠశాలలో ఓ విద్యార్థికి తరగతి గదిలో చేతికి కట్టుకున్న దారాన్ని తీయాలని 2022 సంవత్సరంలో ఆదేశాలు జారీచేశారు. ఈ విషయం అప్పట్లో వివాదస్పదమైంది. ఈ క్రమంలో అప్పట్లో పోలీసు కేసు నమోదైంది. పూర్వాపరాలు విన్న న్యాయాధికారి సదరు ఉపాధ్యాయుడికి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: డీఎల్పీవో

బొంరాస్‌పేట్, జూలై 26: సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎల్పీవో శంకర్‌నాయక్ అన్నారు. డ్రై డే సందర్భంగా బొంరాస్‌పేట్ మండలంలోని మెట్లకుంట గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ రాఘవేందర్, పంచాయతీ కార్యదర్శి సిద్దు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రిపోర్టర్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

వికారాబాద్, జూలై 26 : రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ దిన పత్రిక జిల్లా రిపోర్టర్‌పై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తులను శిక్షించాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాస్ చారి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీధర్, జిల్లా కోశాధికారి కుమ్మరి రాఘవేందర్‌లు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకొని బాధితుడికి న్యాయం చేయాలని తెలిపారు. నిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చే ఒక జర్నలిస్టుపై ఇలా దాడికి పాల్పడిన సంఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేపట్టాలని వారు కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.